క్లుప్తంగా

నేడు సహస్ర తులసీ దళార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్ర నామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబరును 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

పారిశుధ్య కార్మికులకు టోపీల అందజేత



పారిశుధ్య కార్మికులకు టోపీలు అందజేస్తున్న కార్పొరేటర్ పద్మావతి

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డులో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు ఆ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి బుధవారం తెల్ల టోపీలు అందజేశారు. ఎండల తీవ్రత దృష్ట్యా నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, కౌన్సిల్ సభ్యులు తీసుకున్న నిర్ణయం మేరకు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు టోపీలు అందజేసినట్లు కార్పొరేటర్ పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో వార్డు నాయకులు లండా రమణ, టర్నర్ చౌల్ట్రీ మాజీ చైర్మన్ లింగం శ్రీనివాస్, భాస్కరరావు, సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం .. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

కేజీహెచ్‌లో నోటి క్యాన్సర్ పరీక్షలు



నోటి క్యాన్సర్ పరీక్షలు చేస్తున్న దంత విభాగాధిపతి డాక్టర్ త్రివేణి

మహారాణిపేట : ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కింగ్ జార్జి ఆస్పత్రి దంత వైద్య విభాగంలో నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. దంత వైద్య విభాగాధిపతి డాక్టర్ వి.వి.ఎస్. త్రివేణి ఆధ్వర్యంలో వైద్యులు ప్రత్యేకంగా వెల్ స్కోప్ అనే అత్యాధునిక పరికరం ద్వారా నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. పొగాకు, గుట్కా, ఖైనీ అలవాటు కారణంగా నోటిలో వచ్చే సమస్యలపై అవగాహన కల్పించడంతో పాటు రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజ, ఆర్ఎంఓ డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దంత వైద్య విభాగం రూపొందించిన పాటను ఆవిష్కరించారు. ఈ వైద్య సేవలను 200 మందికి పైగా సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వినోద్, లావణ్య, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



విశ్వేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరిదేవీల పరిణయం

పరిణయ శోభ..

- ఆధ్యాత్మికత సంతరించుకున్న దక్షిణ నియోజకవర్గం
- కమనీయంగా సత్యదేవుని కల్యాణం
- వైభవంగా పోర్టు వేంకటేశ్వరస్వామి పరిణయం
- విశ్వేశ్వరస్వామి..బాల త్రిపురసుందరిల కల్యాణ మహోత్సవం
- పెళ్లికొడుకైన సీతారామచంద్రస్వామి

డాబాగార్డెన్స్: విశాఖ దక్షిణ నియోజకవర్గం బుధవారం ఆధ్యాత్మిక శోభతో అలరారింది. ప్రతి ఏటా జ్యేష్ఠ శుద్ధమి నాడు పలు దేవాలయాల వార్షికోత్సవాలు నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీనిలో భాగంగా ఇసుకకొండ(బాబాజీ కొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామి కల్యాణం, పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సూర్యాబాగ్ మెయిన్‌రోడ్డులో వెలసిన విశ్వేశ్వరస్వామి.. బాల త్రిపుర సుందరీదేవికి వివాహం జరిపించారు. అలాగే కనకమహాలక్ష్మి దత్తత దేవాలయమైన అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో స్వామి కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు.

కమనీయం సత్యదేవుని పరిణయం..

ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి వార్షిక దివ్య కల్యాణోత్సవం బుధవారం కన్నుల పండువగా సాగింది. ఉదయం 8 గంటలకు నిత్య హోమాలు, వైనతేయ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 7 గంటలకు ప్రారంభమైన స్వామి దివ్య తిరు కల్యాణోత్సవానికి భక్తులు విశేషంగా తరలివచ్చారు. ఆలయ ఈవో బుద్ధ నాగ జగదీష్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఫణిహారం నరసింహమూర్తి, పలువురు దేవదాయ శాఖ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



సత్యదేవుని పరిణయ దృశ్యం

వైభవంగా పోర్టు వేంకటేశ్వరస్వామి కల్యాణం..

పోర్టు ఏరియా శృంగమణి పర్వతంపై వెలసిన వేంకటేశ్వరస్వామి తిరు కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం 6.30 గంటలకు స్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. దేవదాయ శాఖ సహాయ కమిషనర్ కె. శిరీష, ఈవో శ్రీనివాస్, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భక్తులు కల్యాణంలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.



కల్యాణ కాంతులతో సీతారామచంద్రస్వామి



పోర్టు వేంకటేశ్వరస్వామి కల్యాణానికి సన్నాహం చేస్తున్న దృశ్యం

విశ్వేశ్వరస్వామి.. బాల త్రిపుర సుందరీదేవిల పరిణయం..

నగరంలోని మెయిన్‌రోడ్డు సూర్యాబాగ్‌లో వెలసిన విశ్వేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి విశ్వేశ్వర స్వామి, బాల త్రిపుర సుందరీదేవికి వైభవంగా పరిణయం జరిపారు.

వైభవంగా సీతారామచంద్రస్వామి కల్యాణం..

కనకమహాలక్ష్మి దత్తత దేవాలయం అంబికాబాగ్ సీతారామచంద్రస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం స్వామికి విశేష ఆరాధన, నిత్య హోమాలు, బలిహరణ నిర్వహించారు. అనంతరం వైఖానస సాంప్రదాయ రీతిన కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు తిరుపతిరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్రాఫ్ట్ డిజైనింగ్‌లో విద్యార్థులకు శిక్షణ



తయారు చేసిన క్రాఫ్ట్స్‌తో విద్యార్థులు



గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన కలిగిస్తున్న ఏవీవీఎస్ఎస్ఎన్ మూర్తి

అల్లిపురం: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అల్లిపురం శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు క్రాఫ్ట్ డిజైన్స్ తయారీలో శిక్షణ ఇచ్చారు. రీసోర్స్‌పర్సన్ జి.వాసు విద్యార్థులకు క్రాఫ్ట్ డిజైన్స్ రూపొందించడంలో మెలకువలు తెలిపారు. శిక్షణలో భాగంగా విద్యార్థులు తయారు చేసిన క్రాఫ్ట్స్ ఆకట్టుకున్నాయి. ఈ విధంగా మంచి క్రాఫ్ట్స్ తయారు చేయాలని, పోటీల్లో పాల్గొని బహుమతులు గెలవాలని వాసుతో పాటు గ్రంథాలయాధికారి పీవీఎన్ రాజు, పాఠకులు ఆకాంక్షించారు.

గ్రంథాలయాలపై అవగాహన

డాబాగార్డెన్స్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం రిటైర్డ్ లైబ్రేరియన్ గ్రేడ్-2 ఏవీవీఎస్ఎస్ఎన్ మూర్తి పాల్గొని పిల్లలకు గ్రంథాలయంపై అవగాహన కల్పించారు. గ్రంథాలయం అంటే ఏంటి? అందులో పుస్తకాలు ఏమేమి ఉంటాయో పిల్లలకు వివరించారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించాలని పిల్లలకు సూచించారు. అనంతరం రీసోర్స్‌పర్సన్ జి. అనురాధ పిల్లలకు ఆక్టివిటీ గేమ్ ఆడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ లైబ్రేరియన్ పీవీ నూకరాజు, సిబ్బంది వర్మ, అరుణ, విద్యార్థులు పాల్గొన్నారు.

కెమికల్ ఇంజినీరింగ్ వర్క్‌షాప్



వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న ఏయూ ఆచార్యులు

ఆరిలోవ: ఆంధ్రా యూనివర్సిటీలో కెమికల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ సమత, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.కృష్ణమోహన్, ప్రొఫెసర్ ఎస్.వి.నాయుడు, తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ-మొబిలిటీ, మోడలింగ్ అండ్ కంట్రోల్ ఆఫ్ వేస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ కన్వీనర్ డాక్టర్ ఆర్.పద్మశ్రీ, సైంటిస్ట్ శ్రీనివాస్ కుమార్, ప్రొఫెసర్ శేషగిరిరావు, ప్రొఫెసర్ ఎం.వి.వి.చందన లక్ష్మి పాల్గొన్నారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ విల్లూరి

జగదాంబ: వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలన అందిస్తోందని కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు అన్నారు. బుధవారం జీవీఎంసీ 35వ వార్డులో దివంగత నేత వైఎస్సార్ విగ్రహం వద్ద జగనన్న నాలుగేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. నాలుగేళ్లలో ఏ ముఖ్యమంత్రి చేయని అభివృద్ధిని జగన్ చేశారన్నారు. రాష్ట్రంలో 40 లక్షల ఇళ్లు నిర్మించి పేదల సొంతింటి కలను నిజం చేశారన్నారు. వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు నాయిని మల్లిబాబు, కంటిపల్లి వరలక్ష్మి, మంగరాజు, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ గౌరీశంకర్, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

జోన్-4 ఏఎంహెచ్‌వోగా సత్యనారాయణ



ఏఎంహెచ్‌వో సత్యనారాయణకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లు

జగదాంబ: జీవీఎంసీ జోన్-4 కార్యాలయం ఏఎంహెచ్‌వోగా సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన కిశోర్ జోన్-2కు బదిలీపై వెళ్లడంతో గాజువాక కార్యాలయం నుంచి జోన్-4 కార్యాలయానికి సత్యనారాయణ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రతకు కృషి చేస్తామన్నారు. స్వచ్ఛభారత్ ర్యాంక్ కోసం సిబ్బందితో కలిసి పని చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

మహత్ కాలనీలో బోరు ఏర్పాటు



బోరు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వెంకటరమణ

మద్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మహత్ కాలనీలో రూ.1.50 లక్షల జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేసిన బోరును బుధవారం కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో నీటి ఎద్దడి సమస్య నియంత్రణలో భాగంగానే బోరు ఏర్పాటు చేశామన్నారు. స్థానిక ప్రజలు వేసవిలో నీటిని వృథా చేయరాదని కోరారు. కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, పైడి ప్రతాప్, కె.శ్యామ్, పి.లక్ష్మణ్, డి.రాణి, బి.రమణ, జై భీమ్ సేవా సంఘం సభ్యులు, ఆది ఆంధ్రా సేవా సంఘం సభ్యులు, సచివాలయ సిబ్బంది, వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

ధూమపానం హానికరం



మాట్లాడుతున్న మాజీ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు

సీతంపేట: ఆరోగ్యానికి హానికరమైన ధూమపానం నిషేధంపై ప్రభుత్వాలు కఠిన చర్యలు చేపట్టాలని ఆంధ్రా యూనివర్సిటీ మాజీ రిజిస్ట్రార్ వి.ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ బ్యాంకులో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ పొగాకు వ్యతిరేక దినోత్సవం ఒక్కరోజు కాకుండా నిరంతరం పాటించాలని సూచించారు. తద్వారా తమ ఆరోగ్యంతోపాటు ఎదుటి వారు కూడా ఆరోగ్యంగా ఉంటారన్నారు. డాక్టర్ కె.శ్రీలత మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తే ధూమపాన నిషేధం సాధ్యమవుతుందన్నారు. బ్యాంకు పీఆర్వో జి.ఎస్. బ్యాంకు చైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బ్యాంకు డైరెక్టర్లు బి.నాగేశ్వరరావు, ఎస్. ఆంజనేయులు, సీఈవో శ్యామ్‌కిషోర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సేవలో వలంటీర్ల పాత్ర కీలకం



సత్కారం పొందిన వలంటీర్లతో ఎమ్మెల్యే వాసుపల్లి, మేరీజోన్స్

డాబాగార్డెన్స్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కొనియాడారు. 36వ వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు ఆధ్వర్యంలో వార్డు పరిధి గొడారిగోతులు కమ్యూనిటీ భవన్‌లో బుధవారం వార్డు పరిధిలో ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సేవా వజ్ర, సేవారత్న అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. నిరుపేదలకు తక్షణ సాయం అందేలా, ప్రభుత్వ పథకాలు ప్రజల ముంగిటకు చేరేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరుస్తూ, వారి అభ్యున్నతే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా పేదలకు సంక్షేమ పథకాలు అందించేలా నిరుద్యోగ యువతను భాగస్వామ్యం చేస్తూ సచివాలయ/వలంటీర్ వ్యవస్థను స్థాపించారన్నారు. 36వ వార్డులో 5 సచివాలయాల్లో 86 మంది వలంటీర్లను సేవామిత్ర, గొడారిగోతులు సచివాలయ వలంటీర్ రుజీబ్ మహ్మద్‌ను సేవా రత్న, మరో వలంటీర్ నెల్లి నీలిమను సేవా వజ్ర పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు వార్డు కార్పొరేట్ మేరీజోన్స్, వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, దశమంతుల మాణిక్యాలరావు, రమణమ్మ, రమణి, కుందేటి సుధాకర్, నర్సింగ్, గౌతమ్, లియాకత్, శ్రీధర్, కిషోర్, శేఖర్, యామిని, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉమా చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణోత్సవాలు



టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానం

అల్లిపురం: టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వేంచేసిన ఉమా చంద్రమౌళీశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. గురువారం కల్యాణరాట మహోత్సవం చేపట్టనున్నట్లు వివరించారు. 2వ తేదీ ఉదయం 7 గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షా వస్త్రధారణ, కంకణధారణ, మండపారాధన, ధ్వజారోహణ ఉంటాయన్నారు. 3వ తేదీన స్వామి వారికి విశేష అభిషేకాలు, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అదేరోజు సాయంత్రం ఉత్సవ విగ్రహాల తిరువీధి ఉత్సవం అనంతరం దివ్య కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉద్యోగులకు సత్కారం



కారి చుక్కయ్యను సత్కరిస్తున్న సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: విధి నిర్వహణలో బాధ్యతగా మెలగడమే కాక సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న పలువురు ఉద్యోగులను ఎఫ్‌సీఏ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ దాసరి రాంబాబు బుధవారం ఘనంగా సత్కరించారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పలువురు ఉద్యోగులను నగదు ప్రోత్సాహకాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శి టీవీ భాస్కర్, ఉపాధ్యక్షుడు ఉరుకూటి శ్రీనివాసరావు, జాతీయ సలహాదారు రామపాటి శామ్యూల్ జాన్ ధర్మరాజు, అడిషనల్ జనరల్ మేనేజర్ ఎస్. తబిత, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్. సుభాష్‌తో పాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి కారి చుక్కయ్యను నగదు ప్రోత్సాహంతో సత్కరించారు.

ఘనంగా సూపర్ స్టార్ కృష్ణ జయంతి



జగదాంబ థియేటర్‌లో కేక్ కట్ చేస్తున్న విశాఖ సిటీ వైడ్ కృష్ణ, మహేష్‌బాబు అభిమానులు



రక్తదానం చేస్తున్న గ్రీన్‌సిటీ కుటుంబ సభ్యులు, అభిమానులు

డాబాగార్డెన్స్: సూపర్ స్టార్ కృష్ణ జయంతి బుధవారం విశాఖ సిటీవైడ్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ అసోసియేషన్ (సరస్వతీ పార్క్) ఆధ్వర్యంలో జగదాంబ థియేటర్లో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు గాజుల వెంకట్రావు, అధ్యక్షుడు బీసీ అప్పారావు, ఉపాధ్యక్షుడు మన్యాల శ్రీనివాస్, అసోసియేషన్ డైమండ్ పార్క్ ప్రెసిడెంట్ మద్ది రాజశేఖర్‌రెడ్డి, గీతా పార్లర్ మురళీ కృష్ణ, ఇంద్ర భాస్కర్, న్యూకాలనీ చిన్న, కె. శ్రీనివాసరావు, ప్రభాకర్, ఎస్‌కే మదీనా, రెడ్డి, జీఎస్ కుమార్, విజయ్ పలువురు అభిమానులు పాల్గొని ముందుగా కృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఒకరికొకరు తినిపించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్‌స్టార్ కృష్ణ గొప్ప మానవతావాదని, మంచి మనిషి.. మహా మనిషని కొనియాడారు. కృష్ణ అభిమానులుగా పుట్టడం ఎంతో ఆనందించదగ్గ విషయమన్నారు. కృష్ణ మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు.

గ్రీన్‌సిటీ క్లబ్‌లో..

ప్రముఖ హీరో కృష్ణ 81వ జయంతి సందర్భంగా నేషనల్ రియల్ ఎస్టేట్ డెవలప్‌మెంట్, గ్రీన్‌సిటీ క్లబ్ సంయుక్తంగా కృష్ణ అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రీన్‌సిటీ రెసిడెన్షియల్ కుటుంబ సభ్యులు, సూపర్ స్టార్ కృష్ణ అభిమానులు పాల్గొని ముందుగా కృష్ణ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సుమారు 80 మందికి పైగా మహిళలతో పాటు క్లబ్ సభ్యులు, అభిమానులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గ్రీన్ సిటీ ఎండీ బావినేని సురేష్, నవ్వుల నగేష్ మాట్లాడుతూ ప్రతి ఏడాది సూపర్‌స్టార్ కృష్ణ పేరిట అభిమానంతో రక్తదాన శిబిరం నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. తద్వారా సేకరించిన రక్తాన్ని నిరుపేదలకు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, డి. మురళీకృష్ణ, ఎస్‌కే రఫీ, వేణు, గ్రీన్‌సిటీ అభిమానులు పాల్గొన్నారు.

జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతానికి సహకారం



తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఆరిలోవ : జపాన్‌కు చెందిన తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పి.ఎం.బాలాజీ బుధవారం ఏయూను సందర్శించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వారు సమావేశ మందిరంలో భేటీ అయ్యారు. ఏయూలో నిర్వహిస్తున్న జపనీస్ లాంగ్వేజ్ కోర్సుల గురించి చర్చించారు. ఈ కోర్సులు విద్యార్థులకు ఉపయుక్తంగా ఉండేలా తగిన సహకారం అందించాలని రిజిస్ట్రార్ ఈ సందర్భంగా తోషిబా కంపెనీ వైస్ ప్రెసిడెంట్ బాలాజీని కోరారు. ఈ మేరకు స్పందించిన బాలాజీ మాట్లాడుతూ జపనీస్ లాంగ్వేజ్ కోర్సు బలోపేతం చేయడానికి పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జపనీస్ ఇన్ఫర్మేషన్ అండ్ స్టడీ సెంటర్ డైరెక్టర్, ఫారిన్, లింగ్విస్టిక్స్ డిపార్ట్‌మెంట్ హెడ్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.మూర్తి, నన్నయ వర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య ఎం.జగన్నాథరావు పాల్గొన్నారు.

మత్తుకు అలవడి జీవిత కాలాన్ని తగ్గించుకోవద్దు



యోగా తరగతిలో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

దొండపర్తి : వరల్డ్ నో టొబాకో డే సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్‌వర్మ ఆదేశాల మేరకు బుధవారం సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో పోలీస్ అధికారులు, సిబ్బందికి యోగా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా మత్తు కోసం ఎంతో విలువైన జీవిత కాలాన్ని తగ్గించుకుంటున్నారని, పొగాకుకు దూరంగా ఉండాలని సూచించారు. పని ఒత్తిడి నుంచి వెంటనే బయటపడి మనస్సును ప్రశాంతంగా ఉంచుకొనే మార్గాలను, అలాగే సిబ్బందికి మనోధైర్యం పెంపొందే పలు మార్గాలను వివరించారు. పాజిటివ్ థింకింగ్ కోసం ధ్యానం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీ(ఏఆర్) ఆర్.పి.ఎల్.శాంతికుమార్, ఆర్ఐలు రాఘవేంద్ర, టి.భగవాన్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించాలి

జగదాంబ: చిన్నారులు క్రీడల్లో రాణించాలని ఎస్సీ సెల్ అధ్యక్షుడు కస్తూరి వెంకట్రావ్ అన్నారు. జీవీఎంసీ 35వ వార్డు ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ స్టేడియంలో రాంబో కిక్ బాక్సింగ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులకు ఆయన డైట్ పంపిణీ చేశారు. క్రీడలతో దేశానికి పేరు తీసుకురావడంతో పాటు క్రీడాకారులుగా ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. క్రీడల కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు దక్కించుకోవచ్చని తెలిపారు. క్రీడాకారులు ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. శారీరక దారుఢ్యానికి క్రీడలు దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కిక్ బాక్సింగ్ కోచ్ కనకరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.